స్కెచ్

# ప్రత్యేక విలేఖరులు

అవసరాల రామకృష్ణరావు

"ఎన్నాళ్ళవుతే ఏమైందో!"

"ఏమయిందేమిటే?"

"ఏమయిందా, పాపం బ్రద్దలయింది, ఇలా ఎన్నాళ్ళనుంచి జరుగుతోందో!"

"ఏం జరిగిందీ?"

"ఏం జరిగిందేమిటి, కొంప లంటుకుంటూంటేను! ఇలాంటి వాళ్ళుంటే వర్షాలు ఎలా కురుస్తాయి? యుద్ధాలు ఎలా ఆగుతాయి."

"అబ్బ! నీ ధోరణి నీదేకాని నామాట వినిపించుకోవే - ఎవరి గురించీ నువ్వంటూంటు?"

'ఇంకెవరూ, మన సీతారామమ్మగారు!'

'సీతారామమ్మగారెవరే?'

'అబ్బబ్బ. నీతో వచ్చిన గొడవే యిది! అన్నీ మొదట్నుంచీ చిలక్కి చెప్పినట్టు చెప్పాలి. చావలి వారి వీధిలో కొళాయి దగ్గిర మేడ. ఆ మధ్య కొళాయిలు కట్టేసినప్పుడు యిక్కడికి నీళ్ళ కొచ్చేది కాదుటే? సీతారామమ్మ!'

"ఓహో! ఆవిడా, అవునవును జ్ఞాపకం వచ్చింది. చారెడేసి కళ్ళూ ఆవిడా మనిషి బాగుండేది కూడాను!"

"అదుగో ఆ అందమే కొంప తీసింది! ఎందుకూ, వెధవ అందం ఉండగానే సరా, తగిన గుణ ముండద్దూ?"

"ఏం, ఆవిడ గుణానికే మొచ్చిందే! ఇక్కడి కొచ్చినప్పుడల్లా ఎంతో ఆప్యాయంగా మర్యాదగా..."

"ఇలాంటి దొంగ మర్యాదలు చూపే, చూస్తూండగా మొగుడు కళ్ళల్లో కారం కొట్టింది."

"అసలు జరిగిందేమిటో స్పష్టంగా చెప్పవే!"

"అయితే విను. మొన్న సాయంకాలం గున్నయ్య పంతులు, అదే ఆవిడ మొగుడు యింటికి వచ్చాడు. కొత్త ముసలికాలం చూడు పెళ్ళాం చూస్తే అందమయినదీ, చిన్నదీను; అనుమానం ఉండక పోతుందా? అలవాటు కొద్దీ ఆవిడ ఏం చేస్తోందోనని కిటికీలోంచి చూశాడుట - చూస్తే ఏముంది? దృశ్యం చూడలేక కళ్ళు మూసుకొని, చేసేదిలేక పళ్ళు బిగించి గది తలుపు గొళ్ళెం పెట్టేడుట"

"దృశ్యం ఏమిటే?"

"ఇలా మధ్యలో ప్రశ్నలు వేశావంటే నేను జెప్పలేను సుమా..."

"చెబుదూ మధ్యలో నీఅలకలు కూడాను"

"దృశ్యానికేముంది, ఆవిడగారు వయ్యారంగా మంచం మీద పడుకొందిట... దగ్గరగా ఓ పురుషుడు... అదుగో సుబ్బమ్మ వస్తోంది అడుగుదాముండు"

"సుబ్బమ్మేనా ఏమిటి నీకిదంతా చెప్పింది?"

"మరేంరా సుబ్బమ్మా!"

"ఏమిటి సూరీడూ అంటున్నావ్?"

"అబ్బే! నాంచారమ్మ తోటి నిన్న జరిగిన సంగతి చెబుతున్నాను."

"అతను, అదే సీతారామమ్మ దగ్గిర కొచ్చిన మొగాడు కాళ్ళదగ్గిర కూర్చున్నాడన్నానా? దగ్గిరగా కూర్చున్నా డన్నానా? నాంచారమ్మతో అలా చెపతావేం?"

"నువ్వు చెప్పినట్టే చెప్పడానికి నేనేం కంఠతో పెట్టేననుకున్నావుటమ్మా సుబ్బమ్మా"

"ఒక ఆడదాని నోటిలోంచి మరొక ఆడదాని దగ్గరకు పోయేటప్పుడు మాట పెరగడం మామూలేగాని, తరువాత ఏంజరిగిందో చెప్పవే సూరీడూ?"

"చెప్పడానికేముందీ?, గున్నయ్య గుసగుసలాడుతూ వెళ్ళి నలుగుర్నీ పిలుచుకొచ్చేడుట"

"అయినా అంత ధైర్యమేమిటమ్మా, తలపైనా వేసుకోకుండా 'హాలు గది'లో...... శ్రీరామచంద్ర!"

"ఏదో మంచిదని యీ నాలుగురోజులూ దాన్ని రానిచ్చాంగాని మనవాళ్ళువింటే ఏమనుకొంటారు నాంచారీ?"

"ఇంకా అదో మాటో? అందులో మన భర్తలకు అనుమానాలెక్కువ! పదండే పోదాం మన కెందుకు?"

"ఆ తర్వాత ఏమైంది సుబ్బమ్మా?"

"ఏమో 'శమంతకం' ఆ తర్వాత సంగతి చెప్పలేదు"

"అయితే నువ్వా కళ్ళతో చూడలేదన్న మాట. అవునా సుబ్బమ్మా?"

"అదిగో శమంతకమే ఇటువస్తోంది, దాన్ని అడుగుతే అన్నీ తెలిసి పోతాయి - ఏమే శమంతకం, సీతారామమ్మ సంగతి ఏమైంది?"

"ఏమైందీ, నిక్షేపంలా కాపురం చేస్తోంది"

"అదేమిటే, ఎదురుగుండా కనపడ్డానా?"

"ఆ వచ్చినతను ఆవిడకు విశేషంగా తలనొప్పిగా ఉంటే ప్రక్కన కుర్చీమీద కూర్చుని అమృతాంజనం రాశాడుట."

"కాళ్ళదగ్గర కూర్చున్నాడని చెప్పేవు కాదుటే సుబ్బమ్మా?"

"నే నేం కంఠతో పెట్టేనను కున్నావువా, అప్పచెప్పడానికి? తర్వాత ఏమైందే శమంతకం?"

"ఆ ముసలాడు అనుమానం చేతా, కళ్లు కనపడకా అలా అనుకున్నాడు గాని ఆవచ్చిన వారు ఎవరో తెలుసా?"

"ఎవరేమిటి?"

"ఆవిడ తమ్ముడేట!"

# అలజడి

బావురుమని నలుదిక్కులు
తమము భువిని రాల్చెనహో
గగన పథం ఆవులించి
వెలుగు తాగివేసె నహో
పొగలు పొగలు
బుగలు పొగలు
పగలు పగలె
పగిలె పగలు
తమం రెచ్చి
హిమం హెచ్చి
కాంతి గిట్టి
ధ్వాంతి పుట్టి
ఎదలలోని
రొదలు రేగి
పొదలు మండి
సొదలు నిండి
కలలు అలల
తలలు చెదిరి
మెరుగు, మెరుగు
మరుగు బెదిరి
గిరులు శిరసులెత్తె నహో
తరులు కరములెత్తె నహో
ఆమనికోయిల గళమున
తమోధూమ మెగసె నహో
విరిసీ విరియని స్వప్నం
ప్రిదిలి బ్రద్దలయ్యె నహో

దినం దినం
జనం ఖనం
క్షణం క్షణం
ధరణి రణం
కన్ను తిప్పి
మిన్ను మన్ను
నిన్ను న న్న-
తన్ని చూడు
వెలుగుపాట వెలసె నహో
మెలుగుబాట తెలిసె నహో
నులి వెచ్చని నీలికాంతి
నేలపేలజొచ్చె నహో
వాసంత సమీరం- పెను
పులిన తలల నింకె నహో
నల్ల మబ్బు
రెల్లు దుబ్బు
పాడు కోట
పాము రెక్క
బతుకు బరువు
మెతుకు కరువు
హారోం హారోం
హరహరహర
విశ్వవీధి మ్రోగె నహో
అశ్వఘోష వితతు లోహో!

—మల్లాది విశ్వనాథం